క్లుప్తంగా

## భీం వర్ధంతి జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బెజ్జూర్: కుమురం భీం వర్ధంతిని జయప్రదం చేయాలని ఆదివాసీ నాయకులు పిలుపు నిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మాట్లాడారు. ఈనెల 17న ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివాసీ పోరాట యోధుడు వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆదివాసీ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## బెజ్జూర్ ఏవోగా నాగరాజు



ఏడీఏకు రిపోర్టు చేస్తున్న నాగరాజు

బెజ్జూర్: మండల నూతన అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో)గా బానోత్ నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించిన రాజుల నాయుడు గతంలో బదిలీపై వెళ్లడంతో వరంగల్ జిల్లాకు చెందిన నాగరాజు తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. బెజ్జూర్ మండల నూతన మండల అగ్రికల్చర్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరాజును ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## 27న పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలి సేవాసంఘం ఎన్నికలు ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి చెన్నూరి ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌లో స్వల్ప సవరణలు చేసినట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల విరమణ, గుర్తుల కేటాయింపు, 22న నమూనా బ్యాలెట్, 27న ఎన్నికల పోలింగ్, అదే రోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెబ్బెన: మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన దోంగ్రి హక్టయ్య (53) అనే వ్యక్తి ఈనెల 13న ట్రాక్టర్‌పై నుంచి పడి గాయపడ్డాడు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు రెబ్బెన ఎస్సై తెలిపారు. తుంగెడలో ఈనెల 13న నిర్వహించి దుర్గాదేవీ నిమజ్జన కార్యక్రమంలో భాగంగా హక్టయ్య ట్రాక్టర్ వెనుకాల కూర్చుని భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు కదలడంతో కింద పడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తమ్ముడు వాసుదేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అన్నప్రసాద వితరణ

ఆసిఫాబాద్‌అర్బన్: శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో బుధవారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీధర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ఇంద్రాదేవి ఆలయంలో పూజలు



మొక్కుతున్న రాఘపూర్ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీల దసరా పూజలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివా సీలు తరలి వచ్చి ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం మండలంతో పాటు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రాఘపూ ర్ గ్రామాల నుంచి ఆదివాసీలు తరలివచ్చారు. నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్, భక్తులు లక్ష్మణ్, చిక్రం విఠల్, చహకటి రాజు, జంగు, మాన్కు పాల్గొన్నారు.

# ‘రైతుభరోసా’ ఏమాయే?

- సీజన్ చివరి దశకు చేరినా అందని నగదు
- పెట్టుబడి సాయం కోసం నిరీక్షణ
- ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వం



నంబాల శివారులో సాగు చేస్తున్న వరి పంట

రెబ్బెన: పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులకు గురి కావద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. రెండు సీజన్‌లకు కలిసి ఎకరానికి రూ. 10వేల చొప్పున చెల్లించింది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతు భరోసా పథకం కింద రైతులకు ఎకరానికి రూ. 15వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయాన్ని అందచేసింది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైతుభరోసా పథకం అమలుకు ఇప్పటి వరకు ప్రభుత్వం మార్గదర్శకాలు కూడా విడుదల చేయలేదు.

**మండలంలో 12,676 మంది రైతులు..**

మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు 12,676 మంది రైతులను గుర్తించారు. గత యాసంగిలో 11, 865 మంది రైతులు బ్యాంకు ఖాతాల వివరాలను అందించగా వాటిని పరిశీలించి 8,786 మంది రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ట్రెజరీకి అప్పగించింది. ప్రభుత్వం 7,87,78,218 రైతుభరోసా కింద పంపిణీ చేసింది.

**రేపుమాపు అంటూ కాలయాపన..**

కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి రైతు భరోసా పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామంటూ ప్రకటనలు చేస్తుందే తప్పా దాన్ని అమలు చేయటం లేదు. దసరా లోపు ప్రభుత్వం పెట్టుబడిసాయాన్ని అందచేస్తుందని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుభరోసా పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయకపోవటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కనీసం దీపావళి లోపు పెట్టుబడి సాయం అందింతే పంట కోతలకు ఉపయోగకరంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని పెంచి ఎకరానికి రూ. 15వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సీజన్ ముగింపు దశకు చేరుకున్నా.. ఇప్పటి వరకు ప్రభుత్వం పెట్టుబడిసాయం అందించటంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు సేకరించింది. సీజన్ ముగింపు దశకు చేరుకున్నా.. పెట్టుబడి సాయం కింద ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు.

**ఇంకెప్పుడు అందిస్తారు**



వానాకాలం పంటల సాగు పూర్తయ్యే దశకు చేరుకుంది. అయినా.. ఇప్పటి వరకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం పంపిణీ చేయలేదు. ఇంకా ఎప్పుడూ పంపిణీ చేస్తారూ. పెట్టుబడి సాయం అనేది పంటల పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడేలా ఉండాలి.

బుర్స పోషమల్లు, పులికుంట

**సాగు పూర్తవుతుంది**



ప్రభుత్వం ఇప్పటికైనా రైతు భరోసా పథకంలో భాగంగా పెట్టుబడి సాయాన్ని అందించాలి. గత ప్రభుత్వం ఒకటి రెండు నెలలు ఆలస్యంగా నైనా అందించేది. కాని ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు పెట్టుబడి సాయం మాత్రం అందించలేదు. రెండు నెలల్లో వానాకాలం సాగు పూర్తవుతుంది.

– గోపి, దేవులగూడ

**అప్పు తీసుకువస్తున్నాం**



పంటల సాగుకు పైసలు లేక పెట్టుబడుల కోసం బయటి వ్యక్తుల దగ్గర వడ్డీకి అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నాం. పంటల సాగు మొదలయ్యే సమయంలోనే ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా మార్గదర్శకాలు విడుదల చేసి వెంటనే పెట్టుబడి సాయాన్ని అందించాలి.

– ఇంగు మొండి, నంబాల

# అసంపూర్తిగా స్త్రీశక్తి భవనం



అసంపూర్తిగా మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా స్త్రీశక్తి భవనం పూర్తి చేయకుండా అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న పురాతన భవనంలో ఎన్నో ఏళ్లుగా స్త్రీశక్తి భవనం కొనసాగుతోంది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఐకేపీ కార్యాలయం అధికారులు, మహిళా సంఘాల సభ్యులు భయంభయంగా కార్యాలయ భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఉరుస్తుండటంతో పాటు పైకప్పు పెచ్చులు ఊడుతుండడంతో తీవ్ర భయాందోళనల మధ్య విధులు నిర్వహిస్తున్నారు.

**2013లో నిధులు మంజూరు..**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో మండల ఐకేపీ కార్యాలయం భవనం, స్త్రీశక్తి భవనం నిర్మాణానికి 2013లో రూ. 27లక్షలతో నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ కొన్ని మైనర్ పనులు పూర్తి చేయకపోవడంతో అసంపూర్తిగా భవనం దర్శనమిస్తోంది. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతోనే భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని అధికారులు, కాంట్రాక్టర్ చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవనాన్ని ఐకేపీ కార్యాలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

# విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



సిర్పూర్(టి): విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయురాలు

చింతలమానెపల్లి: మండలంలో నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. బుధవారం ఎంఈవో జయరాజ్‌ను కలిసి రిపోర్టింగ్ చేశారు. గూడెం కాంప్లెక్స్ పరిధిలో 15మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు, 2 ఎస్ఏలు, చింతలమానెపల్లి కాంప్లెక్స్‌లో 7 గురు ఎస్జీటీలు, 1 ఎస్ఏ, గంగాపూర్ కాంప్లెక్స్‌లో 7 గురు ఎస్జీటీలు, 2 ఎస్ఏలు విధుల్లో చేరినట్లు తెలిపారు.

సిర్పూర్(టి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ- 24 ఫలితాల్లో ఉపాధ్యాయులు ఎంపికై న వారు బుధవారం విధుల్లో చేరారు. మండలంలో మూడు కాంప్లెక్స్‌లు ఉండగా మొత్తం 30 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు.

బెజ్జూర్: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 46 మంది కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. మండలంలోని బెజ్జూర్, సలుగుపల్లి, పాపన్నపేట కాంప్లెక్స్‌లోని 36 మంది బదిలీపై రిలీవ్ కాగా, 46 మంది కొలువుదీరారు. ఆయా పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రం రాలేకపోయారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి ఉన్నత పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాస్పల్లి శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపైన అవగాహన కల్పించారు. బ్యాంకులో అందిస్తున్న పొదుపు ఖాతాలు, ఇన్సూరెన్సులు, ఫిక్సిడ్ డిపాజిట్లపైన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి వద్ద బ్యాంకుల్లో అందిస్తున్న పథకాలను గురించి చర్చించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి బ్యాంకు ఖాతాలను తెరవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం రాకేశ్, ఉపాధ్యాయులు వెంకటేశ్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత సాధించాలని ముత్తంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కనికి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలు చేసుకుంటే కుటుంబాలకు ధీమా ఉంటుందని తెలిపారు. మహిళ సంఘాలు బకాయిలు చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్, విలాస్, ముక్తేశ్వర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న వైద్యాధికారి రాకేష్



టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్, కొత్తగూడ గ్రామాల్లో పెంచికల్‌పేట్ పశువైద్యాధికిరి రాకేశ్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో, గెదెల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తుందన్నారు. ఆయన వెంట సిబ్బంది సురేశ్, ఆనందరావు, శివ, శేఖర్ ఉన్నారు.

కౌటాల: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాల కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, సిబ్బంది సత్యనారాయణ, శోభన్, భిక్షపతి, ప్రకాశ్, సందీప్ పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను మండల పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలరోజుల పాటు అన్ని గ్రామాల్లో ఉచిత గాలికుంటు నివారణ టీకాలను వేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నరేశ్, సురేశ్, హనుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సారసాల గ్రామ పంచాయతీలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రారంభించారు. ఈసందర్భంగా గాలికుంట సోకకుండా 492 పశువులకు టీకాలు వేశారు. ఈనెల 16 నుంచి నవంబర్ 11 వరకు కొనసాగుతుందని పశువైద్యాధికారి విజయ్ తెలిపారు. గురువారం మండలంలోని రేగులగూడ, ఊట్‌పల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విఏలు శైలేందర్, రాజ్‌కుమార్, గోపాలమిత్రలు జమీర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# చేయిచేయి కలిపారు.. రోడ్డు బాగు చేసుకున్నారు



వాంకిడి: వాగుపై పైపు ఏర్పాటు చేస్తున్న ప్రజలు



బెజ్జూర్: రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న రైతులు

బెజ్జూర్/వాంకిడి: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామస్తులు డబ్బులు పోగు చేసి శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. బెజ్జూర్ మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన రైతులు, వాంకిడి మండలంలోని సర్కేపల్లి గ్రామస్తులు సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు. అధికారులకు విన్నవించినా.. పట్టించుకోకపోవడంతో శ్రమదానం చేసి రోడ్డును బాగు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మహనీయుల విగ్రహాలకు పుష్పాభిషేకం

ఆసిఫాబాద్‌అర్బన్: సమగ్ర కులగణన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ మాట్లాడుతూ.. బీసీ కులగణన ప్రక్రియను ప్రారంభించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాజుల జక్కన్న, వైరాగడే మారుతిపటేల్, వెంకన్న, మోహన్, నారాయణ, ఆనంద్‌రావ్, కమల, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

## వ్యాసరచన పోటీలు



పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

వాంకిడి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాంకిడి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం మండలంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ డిగ్రీ కళాశాలల్లో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చట్టాలు, న్యాయపరమైన హక్కులు, వివిధ అంశాలను ఏఎస్సై పోశెట్టి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృత్తి విద్య కోర్సుపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో వృత్తి విద్య కోర్సులో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ (మీడియా, ఎంటర్టైన్మెంట్) కోసం దసరా సెలవుల్లో పది రోజుల పాటు ఎంపీసీ, వొకేషనల్ ట్రైనర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మహేశ్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పర్యవేక్షణ కోసం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రింటింగ్ ప్రెస్ గురించి ప్రత్యేకంగా చూపించడం జరిగిందన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతిలో ఖాళీగాఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ బీసీ గురుకుల హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని, సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. బుధవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వైద్య విద్య రంగాల్లో అనేక సమస్యలు ఉన్నాయని వీటిని పట్టించుకునే నాథుడే లేడన్నారు. సంక్షేమ గురుకులలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులుకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, ప్రతీనెలా వేతనాలు అందించేలా కృషి చేయాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో శరత్ పూర్ణిమ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో శరత్ పూర్ణిమ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు చంద్రుని కిరణాలు క్షీరంలో పడిన తీర్థాన్ని భక్తులు స్వీకరించారు. చంద్రబింబం పడిన తీర్థాన్ని స్వీకరించడం వలన ఆరోగ్యంగా ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం చుట్టూ పక్కల ఉన్న కూరగాయల దుకాణాలను బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య బుధవారం తొలగించారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కోసం బస్టాండ్, అంగడిబజార్ కోసం ఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలు ఏర్పాటు చేసే ముందు గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని సూచించారు.